# ఖాళీల వెక్కిరింత!

- మున్సిపాలిటీల్లో అధికారులు, సిబ్బంది కొరత
- జిల్లాలోని ఏడు బల్దియాల్లో ఇదే తీరు..
- సేవలందడంలో తీవ్ర జాప్యం
- మున్సిపల్ ప్రజలకు తప్పని తిప్పలు

జిల్లా అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా మున్సిపాలిటీలు సమీప గ్రామాలను కలుపుకొని విస్తరిస్తున్నాయి. అయితే ఆయా బల్దియాల్లో అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యమైన విభాగాల్లో ఖాళీలు భర్తీకి నోచుకోకపోవడంతో ప్రజలకు సేవలందడంలో జాప్యం జరుగుతోంది. కాలనీల్లో అభివృద్ధి, తాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ కరవవుతోంది. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉండటంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై అదనపు భారం పడుతోంది.




**మంచిర్యాలటౌన్:** గ్రేడ్ 1గా ఉన్న మంచిర్యాల మున్సిపాలిటీలో రోజురోజుకు నివాస ప్రాంతాలతో పాటు, జనాభా పెరుగుతుంటే, మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు, పారిశుధ్య కార్మికులు తగ్గిపోతున్నారు. 1.50లక్షల జనాభా ఉన్న మున్సిపాలిటీలో పనిచేసే అధికారులు ఇతర ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తుండగా, రెగ్యులర్ పోస్టు ఉన్నవారు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు తీసుకుంటుండగా, వాటిని పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ నిజామాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగా ఉండగా, టీపీఎస్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. మున్సిపల్ మేనేజర్ పోస్టు రెగ్యులర్ కాకపోవడంతో, పెద్దపల్లి జిల్లాకు చెందిన వారికి డిప్యూటేషన్ అప్పగించారు. అభివృద్ధి పనుల్లో కీలకంగా ఉండే ఇంజనీర్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ ఈఈగా ఉన్న మధుకర్‌కు బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు బాధ్యతలు ఇవ్వడం వల్ల రెండు మున్సిపాలిటీలను పర్యవేక్షించడంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. అకౌంటెంట్ ఆఫీసర్‌కు మూడు నుంచి నాలుగు మున్సిపాలిటీలను ఇన్‌చార్జిగా ఇవ్వడంతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. పారిశుధ్య విభాగంలో కీలకంగా ఉండాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో, ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులు రిటైర్ అవుతున్నా, వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడం, 2011జనాభా లెక్కల ప్రకారమే కార్మికులు పనిచేస్తుండడంతో ఇబ్బందిగా మారుతోంది. 298మంది కార్మికులు ప్రస్తుతం పనిచేస్తుండగా, మరో 50మంది అవసరమున్నారు. ఈ ఏడాది జూన్‌లో 7మంది రిటైర్ అవుతుండగా, 60ఏళ్లు పైబడిన 30మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తుండగా, వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవాల్సిన అవసరం ఉంది. సరిపడా కార్మికులు లేకపోవడంతో పారిశుధ్య పనులతో పాటు, చెత్త సేకరణ ఇబ్బందిగా మారుతోంది.

## పారిశుధ్య సిబ్బంది కొరత

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీలో రెగ్యులర్ సిబ్బంది 43మంది ఉన్నారు. పారిశుధ్య సిబ్బంది కొరత ఉండడంతో ఇటీవల కలెక్టర్ అనుమతితో ప్రత్యేక సిబ్బంది ఇరవై మంది వ్యక్తులను నియమించారు. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు ఉండడంతో బల్దియా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 65వ ర్యాంకు వచ్చినా, సిబ్బంది కొరతతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. చెత్త, నాలాలు, శుభ్రం చేయడానికి సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం పదిహేను వార్డుల్లో ప్రతి రోజు శుభ్రం చేయడానికి సిబ్బంది సరిపోవడం లేదని మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ పేర్కొన్నారు.

## చెన్నూర్‌లో అరకొరగానే...

**చెన్నూర్:** మున్సిపాలిటీ 2018 ఆగస్టులో ఏర్పాటు కాగా, నేటికీ పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించలేదు. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అరకొర సిబ్బందితో అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టులు – 2, సీనియర్ అకౌంటెంట్ – 1, జూనియర్ అకౌంటెంట్ – 1, వార్డు ఆఫీసర్లు – 3 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఇప్పటికైనా సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## పోస్టులు 109.. ఖాళీలు 57

**బెల్లంపల్లి:** ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీలో అన్ని విభాగాలను కలిపి 109పోస్టులు ఉండగా వీటిలో ప్రస్తుతం 52పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. మరో 57పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పబ్లిక్ హెల్త్ వర్కర్లు 73మందికి గాను అత్యధికంగా 45పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్ మేస్త్రీ పోస్టులు 4మంజూరు కాగా ఏళ్ల నుంచి 3పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. అటెండర్ పోస్టులు 4ఉండగా 3పోస్టులు భర్తీ కాకుండా ఉంటున్నాయి. బిల్ కలెక్టర్లు ఐదుగురు ఉండాల్సి ఉండగా 3పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సీనియర్ అసిస్టెంట్ పోస్టులు 4ఉండగా 1పోస్టు భర్తీ కాకుండా ఉంటోంది. జూనియర్ అసిస్టెంట్ 8పోస్టులకు గాను ప్రస్తుతం 6పోస్టులు భర్తీ చేయగా మరో 2పోస్టుల ఖాళీగా ఉన్నాయి. సరిపడా అధికారులు, సిబ్బంది లేక పురప్రజలకు సత్వరంగా సేవలు అందించలేకపోతున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై అదనపు పని భారం పడుతోంది. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి ఖాళీ పోస్టుల భర్తీకి చిత్తశుద్ధితో వ్యవహరించాలని పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మందమర్రిలో సమయానికి సేవలందట్లే..

**మందమర్రిరూరల్:** మున్సిపాలిటీ పరిధిలో 24వార్డులు ఉండగా పలు ఏరియాల్లో సమయానికి సేవలందక ప్రజలు ఇబ్బందిపడక తప్పడం లేదు. మున్సిపాలిటీలో ఇద్దరు ఏఈలకు ఒక్కరు మాత్రమే ఉన్నారు. నలుగురు సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు గాను ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఆరు జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు గాను ఇద్దరు మాత్రమే ఉన్నారు. 19వార్డు ఆఫీసర్స్ పోస్టులకు గాను ఆరుగురు మాత్రమే ఉన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేరు. ఇద్దరు అకౌంటెంట్‌లకు ఒక్కరు కూడా లేరు. ఒక్క టీపీవో పోస్ట్ ఖాళీగా ఉంది. ఇద్దరు టీపీఎస్ పోస్టులకు ఒక్కరే ఉండగా, అతడు వారానికి రెండు రోజులు మాత్రమే మందమర్రిలో విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన నాలుగు రోజులు వేరే చోట చూసుకుంటారు. టీపీబీవో నాలుగు పోస్టులు ఉండగా ఖాళీగానే ఉన్నాయి. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ గద్దె రాజును వివరణ కోరగా ఖాళీల విషయం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని వారి ఆదేశాల మేరకు నియామకాలు జరుగుతాయన్నారు.

## 'క్యాతనపల్లిలో పూర్తిస్థాయి పర్యవేక్షణ కరువు'

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో అధికారులు లేక ప్రజలకు సకాలంలో సేవలు అందటం లేదు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఒక్క రెగ్యులర్ అధికారి కూడా మున్సిపాలిటీకి లేరు. దీంతో అక్రమ లేఔట్లు, కట్టడాలను గుర్తించలేని పరిస్థితి. 40వేల పైచిలుకు జనాభా కలిగిన ఈ మున్సిపాలిటీకి శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్‌లు లేరు. అకౌంట్స్ ఆఫీసర్, ఏఈ కూడా లేకపోవడంతో అరకొర సిబ్బంది కారణంగా చాలామట్టుకు పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇన్‌చార్జీలుగా ఉంటున్న వారు వారానికి ఓ సారి, రెండుసార్లు వస్తుండటంతో ఇంత పెద్ద జనాభా ఉన్న మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కరువవుతోంది. ఇంజినీరింగ్ విభాగంలోనూ సరిపడా సిబ్బంది లేకపోవడంతో వీధిదీపాల నిర్వహణ సరిగా ఉండటం లేదు. ఇక వాటర్ సప్లై, పారిశుధ్య, ఎలక్ట్రికల్ విభాగాల్లోనూ తగినంత సిబ్బంది లేరు. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ఉండటం లేదు.

## నస్పూర్‌లో నెమ్మదించిన అభివృద్ధి పనులు

**నస్పూర్:** మున్సిపాలిటీ 2018లో ఏర్పాటు కాగా నేటి వరకూ పూర్తిస్థాయి సిబ్బంది లేక పట్టణంలో పలు అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. మున్సిపాలిటీలో సుమారు 93వేల పై చిలుకు జనాభా ఉంది. మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతీ పది వేల జనాభాకు 28మంది సిబ్బంది అవసరం ఉంది. కాగా ప్రస్తుతం 273మంది సిబ్బంది అవసరం కాగా 129మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. కొందరిని తాత్కాలిక పద్ధతిలో విధుల్లోకి తీసుకోగా, ప్రస్తుతం మున్సిపాలిటీలో 215మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 129మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కాగా 86మందిని వివిధ డిపార్టుమెంట్‌లలో తాత్కాలిక పద్ధతిలో నియమించుకున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా సిబ్బంది సంఖ్య పెంచాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

## క్లుప్తంగా

### రేషన్ షాపుల తనిఖీ



తనిఖీ చేస్తున్న డెప్యూటీ తహసీల్దార్

**నెన్నెల:** మండలంలోని రేషన్ షాపులను గురువారం డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఆర్ఐ గణేష్ తనిఖీ చేశారు. దుకాణంలో బోర్డుపై పేరు ఉన్న వ్యక్తులే నడిపిస్తున్నారా, లేక వేరే వ్యక్తికి అప్పగించారా అనే కోణంలో ఆరా తీశారు. రేషన్ షాపులలోని బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. డీలర్లు సమయపాలన పాటిస్తూ రేషన్ సక్రమంగా అందించాలని ఆదేశించారు. తెల్లరేషన్ కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని డీలర్లకు సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడాకారులతో జీఎం మనోహర్

**మందమర్రిరూరల్:** మందమర్రి ఏరియాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి వివిధ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులకు ఏరియా జీఎం మనోహర్ గురువారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఏరియా ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు మైత్రేయబంధు, పైడేశ్వర్, కార్తీక్, గుర్తింపు కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ రవికుమార్ ఉన్నారు.

### వినోద్‌ను కలిసిన నేతలు

**శ్రీరాంపూర్:** సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్‌కుమార్, ఎస్టీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దారావత్ రాజేశ్ కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. సింగరేణి సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయినట్లు వారు తెలిపారు.

### ఓటరు నమోదుకు అవకాశం

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మండల పరిధిలోని 32పోలింగ్ కేంద్రాల్లో 20, 21తేదీల్లో బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని తహసీల్దార్ సతీశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ముసాయిదా ఓటరు జాబితా, ఓటరు నమోదు, సవరణ, మార్పు తదితర వాటి కోసం దరఖాస్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18సంవత్సరాలు నిండిన వారు విధిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి, నియోజకవర్గానికి ఓటు మార్పు, అభ్యంతరాలపై కూడా దరఖాస్తులు స్వీకరించవచ్చని తెలిపారు.

### మెప్మా ఆర్పీలకు వేతనాలు పెంచండి

**చెన్నూర్:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సంక్షేమ ఫలాలు అర్హులకు అందించడంలో కీలకభూమిక పోషిస్తున్న చెన్నూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలకు వేతనాలు పెంచాలని కోరుతూ గురువారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆర్పీల సంక్షేమ సంఘం నాయకురాళ్లు భూమక్క, జువ్వాజి రేణుక తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీలు కుందారపు లక్ష్మి, సరిత, మహేశ్వరి, రజిత, రాజమణి, హేమలత, సుధారాణి, కల్పనలు పాల్గొన్నారు.

### పేదల గుడిసెలకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

**చెన్నూర్‌రూరల్:** పేదల గుడిసెలకు ఇళ్ల పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్ ఉమారాణి అధ్యక్షతన, మండలంలోని బావురావుపేట రాజన్న కాలనీవాసుల జనరల్‌బాడీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి పైళ్ల ఆశయ్య హాజరై మాట్లాడారు. కాలనీవాసులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, కుమార్, సమ్మక్క, బూదక్క, నాగజ్యోతి, రేణుక, రాజేశ్వరి, సహనబేగం, మంజుల, సరిత తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్

**మందమర్రిరూరల్:** మందమర్రి మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గురువారం జీపీడీపీ అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. మామిడిగట్టులోని గ్రామసభలో జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్(స్థానిక సంస్థలు) హాజరై గ్రామ పంచాయతీకి 2024–25ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళిక పనులపై వివరాలు తెలుసుకుని తగు సూచనలు చేశారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. సంవత్సర కాలంగా మామిడిగట్టులోని రేషన్‌షాపులో బియ్యం సరిగా పంపిణీ చేయడం లేదనే ఫిర్యాదుతో తహసీల్దార్‌తో మాట్లాడి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం మామిడిగట్టు, ఆదిల్‌పేట్, పొన్నారం గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను సక్రమంగా, సకాలంలో వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శశికళ, ఎంపీవో భీరయ్య, సర్పంచులు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండల పరిధిలోని 17గ్రామ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై గురువారం గ్రామసభలు ఏర్పాటు చేశారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, స్థానికుల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు.

**భీమారం:** మండలంలోని నర్సింగాపూర్, బూర్గుపల్లి గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. గ్రామాల్లో పారుశుధ్య పనులపై ఎక్కువ దృష్టి పెడుతున్నట్లు సర్పంచులు పేర్కొన్నారు. ఇందులో సర్పంచులు రమాదేవి, మల్లేశ్, కార్యదర్శులు దేవేందర్, క్రాంతి పాల్గొన్నారు.

**వేమనపల్లి:** మండలంలోని నాగారాం, సుంపుటం, కళ్లంపల్లి, రాజారాం, దస్నాపూర్ గ్రామపంచాయతీల్లో సర్పంచులు స్వరూపారాణి, బాపు, పద్మ, రాజేశ్వరి అధ్యక్షతన గురువారం జీపీడీపీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీఓ బాపురావు పాల్గొని అభివృద్ధి ప్రణాళికలు నిర్దేశించిన గడువులోపు నమోదు చేయాలని సూచించారు.

# గుండె జబ్బులపై జాగ్రత్తగా ఉండాలి

- హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**శ్రీరాంపూర్:** గుండె జబ్బులపై జాగ్రత్తగా ఉండాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆర్కే 6గనిపై గురువారం నిర్వహించిన గుండె జబ్బులపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సరైన ఆహార నియమాలు పాటించకున్నా, వ్యాయామం చేయకున్నా, అధిక మానసిక ఒత్తిడికి లోనైనా గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. మనిషిలో అతి ముఖ్యమైన అవయవాల్లో గుండె ఒకటని దీన్ని కాపాడుకోవడం కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం, దూమపానానికి దూరంగా ఉండాలని, వేపుడు ఆహార పదార్థాలు, అధికంగా మాంసహారం తీసుకోవద్దన్నారు. తాజా పండ్లు, ఆకుకూరలు తినాలన్నారు. అనంతరం గని మేనేజర్ ఈ తిరుపతి మాట్లాడుతూ వైద్యులు తెలిపిన ప్రకారం జాగ్రత్తలు తీసుకుంటే గుండె జబ్బులు రావన్నారు. ప్రతి ఒక్కరూ ఈ గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏరియా రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ మర్రి కొమురయ్య, సెక్షన్ ఇంజనీర్ మహేశ్, డెప్యూటీ మేనేజర్ శ్యాంకుమార్, సంక్షేమ అధికారి సునిల్‌కుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు తోట మహేశ్, కే నగేశ్, చిలుక రాంచందర్‌లు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### దరఖాస్తుల ఆహ్వానం

**బెల్లంపల్లి:** ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ షబానా అన్సారీ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైందని తెలిపారు. బెల్లంపల్లి మైనార్టీ గురుకులంలో 5వ తరగతిలో 40సీట్లు ఉన్నాయని తెలిపారు. వీటికోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, 7, 8, 9తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం నేరుగా పాఠశాలకు వచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 40సీట్లు, బైపీసీ లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫిబ్రవరి 6వ తేదీ ఆఖరు గడువని తెలిపారు. ఇతర వివరాలకు 75693 49040, 73869 01549 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

### గెస్ట్ ఫ్యాకల్టీకి...

**లక్సెట్టిపేట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం బోధించుటకు అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### క్రికెట్ కిట్ అందజేత

**లక్సెట్టిపేట:** మున్సిపల్ పరిధిలోని గోదావరి రోడ్‌కు చెందిన యూత్ సభ్యులకు శ్రీ శివసాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో అధ్యక్షుడు పాటి బండ్ల శ్రీరామ్మూర్తి క్రికెట్ కిట్ అందజేశారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

**చెన్నూర్:** మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అసిస్టెంట్ మోటర్ వేహికిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్ అన్నారు. 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా చెన్నూర్ పట్టణంలోని కొత్త బస్టాండ్, కోటపల్లి బస్టాండ్‌లలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

### శ్మశాన వాటికలో కట్టిన షాప్‌ను తొలగించాలి

**బెల్లంపల్లి:** మున్సిపాలిటీ పరిధి కాంట్రాక్టర్ బస్తీ శ్మశాన వాటికలో ఉన్న తమ కుటుంబీకుల సమాధులను ఆనుకుని అక్రమంగా నిర్మించిన షాపును వెంటనే తొలగించాలని బాధితుడు కె.శ్రీనివాస్ కలెక్టర్ సంతోష్‌ను కోరారు. కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆ షాపునకు ఇంటి నంబర్ కూడా కేటాయించారని, వెంటనే ఆ నంబర్‌ను రద్దు చేసి, అప్పటి మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.

### చేతిపంపు బాగు చేయండి సారూ..!

**చెన్నూర్:** పట్టణంలోని గాంధీచౌక్‌లో గల చేతిపంపు చెడిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, కాంగ్రెస్ యూత్ నాయకులు పాతర్ల నాగరాజు తెలిపారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి బాగు చేయాలని కోరారు.

### మార్కెట్లో రోడ్డు వేయాలి

**మందమర్రిరూరల్:** మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ ఏరియలో తారురోడ్డు లేక దుమ్ములేచి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, వెంటనే తారు రోడ్డు వేసి దుమ్ము లేవకుండా చూడాలని మాయ రమేష్ అనే వ్యక్తి గురువారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు వినతిపత్రం అందించారు.

### ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

**పాతమంచిర్యాల/బెల్లంపల్లి:** దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, బెల్లంపల్లిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. టీ టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. పలు చోట్ల సేవాకార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కమ్మసేవా సమితి కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 30యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించారు.

# సమస్యలపై సభ్యుల ఫోకస్..!

- నేడు బెల్లంపల్లి మున్సిపల్ సర్వసభ్య సమావేశం

**బెల్లంపల్లి:** మున్సిపల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం రసవత్తరంగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతానికి భిన్నంగా వ్యవహరించాలని ఏకాభిప్రాయానికి వచ్చినట్లుగా సమాచారం. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై సభ్యులు ఈ నెల 12న అవిశ్వాసాన్ని ప్రకటించారు. కోరం లేకపోవడంతో వారిద్దరిపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగి పోగా, యధాతథంగా చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ మరో ఏడాది కాలం ఆ పదవుల్లో కొనసాగే అవకాశాలు ఏర్పడ్డాయి. ఆ పరిణామాల ప్రభావంతో అసంతృప్తికి గురైన 20మంది సభ్యులు కలిసికట్టుగా సమస్యలపై సర్వసభ్య సమావేశంలో గొంతెత్తే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది.



### వీటిపైనే దృష్టి...

- మున్సిపాలిటీలో 34వార్డులు ఉండగా అన్ని వార్డుల్లో సమంగా అభివృద్ధి పనులు జరగలేదు. మౌలిక సౌకర్యాలను కల్పించడంలో వివక్షత ప్రదర్శించారు. ఈ సారి జరిగే సమావేశంలో అన్ని వార్డుల్లోనూ సదుపాయాల కల్పనకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని పట్టుబట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.
- మున్సిపాలిటీలో గోదారి జలాల సరఫరా నిలిచిపోయి ఏళ్లు గడుస్తుంది. మిషన్ భగీరథ పథకం నీటిని సరఫరా చేస్తున్నా, ఆ నీళ్లను తాగడానికి ప్రజలు నిరాసక్తత కనబరుస్తున్నారు. గోదారి జలాలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధానంగా ప్రస్తావించడానికి సభ్యులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.
- నాలుగేళ్ల పాటు మౌన ముద్ర దాల్చిన మహిళా కౌన్సిలర్లు ఈ సారి ఎజెండా అంశాలపై పాలకవర్గాన్ని నిలదీసే యత్నాలు కనిపిస్తున్నాయి.
- మున్సిపల్ వ్యవహారాల్లో ఓ ప్రజాప్రతినిధి భర్త జోక్యంపై ఈ సారి సమావేశంలో సభ్యులు నిలదీయడానికి వెనుకాడని పరిస్థితులు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది.
- పారిశుధ్యం, వీధి దీపాలు, సిబ్బంది కొరత, పార్కుల నిర్వహణ తదితర అంశాలను లేవనెత్తి పాలకవర్గాన్ని ఉక్కిరిబిక్కిరి చేయనున్నట్లు చర్చ జరుగుతోంది.

## రాములోరి అక్షింతలతో శోభాయాత్ర



**వేమనపల్లి/మంచిర్యాలఅర్బన్:** జిల్లా కేంద్రంలో, వేమనపల్లి మండలం నీల్వాయిలో గురువారం రాములోరి అక్షింతల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు.

### అయోధ్య రామమందిర కరపత్రాల ఆవిష్కరణ

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక విశ్వనాథ ఆలయంలో అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ కరపత్రాలను గురువారం శ్రీ రామ శోభాయాత్ర సభ్యులు, ఆలయ అర్చకులు ఆవిష్కరించారు. ఈ నెల 22న మంచిర్యాలలో ఆయా దేవాలయాల్లో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం మధ్యాహ్నం రెండు గంటల 30నిమిషాలకు పట్టణంలో నిర్వహించే భవ్య శోభాయాత్రలో పాల్గొనాలన్నారు. ప్రతి ఇంటిపైన శ్రీరాముని జెండా ఎగురవేయాలని సూచించారు.